www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 18 డిసెంబర్ 2025



వరసిద్ధుని సేవలో నిర్మాత దిల్ రాజు

ప్రజాశక్తి- ఐరాల: శ్రీవరసిద్ధి వినాయకస్వామిని బుధవారం ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం ఈవో పెంచల కిషోర్, దేవస్థానం ఛైర్మన్ మణి నాయుడు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేశారు. అలాగే విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఏఈవో రవీంద్రబాబు స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేశారు.



గ్రామాలు గజ.. గజ..


- కుప్పంలో రైతులను హడలెత్తిస్తున్న ఏనుగుల గుంపు
- నాయనూరు వద్ద రోడ్డుపైకి వచ్చిన ఏనుగులు
- పైపాల్యం వద్ద తిష్ట వేసిన ఐదు ఏనుగుల గుంపు

ప్రజాశక్తి -కుప్పం

ఏనుగుల దాడులతో కుప్పంలోని గ్రామాలు గజగజ వణుకుతున్నాయి. తమిళనాడు వైపు నుండి వచ్చిన ఏనుగుల గుంపు కుప్పం ప్రాంత రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 8 ఏనుగులు రెండు గుంపులుగా విడిపోయి కుప్పం మండలంలో సంచరిస్తుండడంతో ఎప్పుడు ఏనుగులు గ్రామాలపై పడి దాడులు చేస్తుందోనని అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. ఏనుగుల దాడుల్లో ప్రాణనష్టం జరగకుండా అటవీ సిబ్బంది గ్రామీణప్రాంత ప్రజలకు ఎప్పటికప్పుడు ఏనుగుల సమాచారం చేరవేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. అటు తమిళనాడు.. ఇటు కర్ణాటక ఫారెస్ట్ సిబ్బంది, రైతులు ఏనుగులను కుప్పం అటవీ ప్రాంతం వైపు మళ్లిస్తుండడంతో ఇటీవల కుప్పం ప్రాంతంలో గజ దాడులు నిత్యకృత్యం అవుతోంది.

రోడ్డుపైకి వచ్చిన మూడు ఏనుగులు

కుప్పం మండలం నాయనూరు–పెద్దవంక మార్గంలో ఏనుగుల గుంపు రోడ్డుపైకి రావడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. మూడు ఏనుగుల గుంపు రెండు రోజులుగా కుప్పం మండల పరిధిలో రైతులను హడలెత్తిస్తోంది. తమిళనాడు వైపు నుంచి వచ్చిన 8 ఏనుగులు రెండు గుంపులుగా కుప్పం మండల పరిధిలో రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది.



పగటిపూట రోడ్డుపైకి వస్తున్న ఏనుగులు

ఆహారం కోసం వ్యవసాయ పొలాల వైపు..

ఏనుగుల గుంపు ఆంధ్ర, తమిళనాడు అటవీ ప్రాంతంలో తిరుగుతూ రాత్రిపూట ఆహారం కోసం అటవీ సరిహద్దు వ్యవసాయ పొలాలపై పడి అందిన కాడికి తిని వ్యవసాయ పంటలను తొక్కి నాశనం చేస్తున్నాడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఏనుగుల దాడిలో ప్రధానంగా వరి, రాగి, బొప్పాయి, అరటి, టమోటా, బీన్స్ పంటలు సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

అటవీ సిబ్బంది అవస్థలు

వ్యవసాయ పొలాలు, గ్రామాల వైపు వస్తున్న అడవి ఏనుగులను మళ్లీ అటవీ ప్రాంతంలోకి మళ్లించేందుకు ఫారెస్ట్ సిబ్బంది పడరానిపాట్లు పడుతున్నారు. ఏనుగుల దాడుల్లో ప్రాణ నష్టం జరగకుండా అటవీ సరిహద్దు గ్రామాల్లో ఫారెస్ట్ అధికారులు పర్యటిస్తూ ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. ఏనుగు దాడుల్లో పంట నష్టం జరిగితే నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వ ఆదుకుంటుందని అయితే ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకు రైతులు, అటవీ సరిహద్దు గ్రామీణ ప్రజలు రాత్రిపూట పొలాల వద్దకు వెళ్లకూడదని కుప్పం ఎఫ్ఆర్ఓ జయశంకర్ పేర్కొన్నారు. ప్రస్తుతం మూడు ఏనుగుల గుంపు రామకుప్పం మండలం వైపు వెళ్తుండగా 5 ఏనుగుల గుంపు కుప్పం మండలం పైపాల్యం అటవీ ప్రాంతంలో తిష్ట వేశాయి.



చీకటిపడితే చాలు గ్రామాల్లోకి ప్రవేశిస్తున్న ఏనుగుల గుంపు



ఏనుగులను అడవిలోకి తరిమేందుకు పయత్నిస్తున్న అటవీశాఖ అధికారులు

ఏసీబీకి పట్టుబడ్డ సర్వేయర్

- 20 సెంట్లు భూమి సర్వేకి రూ.50వేలు డిమాండ్
- మంగళం సచివాలయంలో ఏసీబీ అడిషనల్ ఎస్పీ విమల కుమారి దాడులు

ప్రజాశక్తి- పుంగనూరు

20 సెంట్లు భూమిని సర్వే చేయడానికి రూ.50 వేలు సచివాలయ సర్వేయర్ డిమాండ్ చేయడంతో అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ అడిషనల్ ఎస్పీ విమల కుమారి తెలిపారు. బుధవారం తిరుపతి అవినీతి నిరోధక శాఖ అధికారులు పుంగనూరు సచివాలయంలో దాడులు జరిపారు. ఈ దాడుల్లో మంగళం సచివాలయ సర్వేయర్ లంచం తీసుకుంటూ అధికారులకు పట్టుబడ్డారు. మండలంలోని మంగళం పంచాయతీ పరిధిలోని 20 సెంట్లు భూమి సర్వే చేయాలని పట్టణంలోని ఉమాశంకర్ మండల సర్వేయర్‌ను ఆశ్రయించారు. ఆయన సూచన మేరకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన చలానాను చెల్లించి తిరిగి సర్వేయర్‌ను కలిశారు. తనకున్న 20 సెంట్లు భూమి సర్వే చేయాలని కోరారు. ఇందుకు గాను సర్వేయర్ శ్రీరాములు రూ.50వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు అంత డబ్బులు ఇవ్వలేక ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు సచివాలయంలో సర్వేయర్ శ్రీరాములుకు రూ.20వేలు లంచం ఇస్తుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం జరిగింది. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు. దాడుల్లో ఇన్స్పెక్టర్లు మల్లికార్జున, వెంకట రమణ, నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.



రూ.20వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిని సర్వేయర్ శ్రీరాములు



మీడియాతో మాట్లాడుతున్న ఏసీబీ అడిషనల్ ఎస్పీ

బాల్యవివాహాలను నిర్మూలించాలి

సీనియర్ సివిల్ జడ్జి భారతి



ప్రజాశక్తి- యాదమరి: బాల్య వివాహాలను నిర్మూలించడం మనందరి బాధ్యత అని చిత్తూరు జిల్లా న్యాయ సహకార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి భారతి అన్నారు. మండలం మహిళా సమైక్య కార్యాలయంలో మహిళలు బాలికల సంబంధించిన పలు చట్టాలపై సమావేశం ఏర్పాటు చేశారు. డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో నిర్వహించి మండల స్థాయి అవగాహన కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా విచ్చేసిన జడ్జి మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళల పట్ల బాలికల పట్ల హింస, వేధింపులు పెరిగిపోతున్నాయని, ముఖ్యంగా బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. చిన్నపిల్లలపై కూడా లైంగిక దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గుట్టుచప్పుడు కాకుండా మాదకద్రవ్యాల వినియోగం జరుగుతున్నదని మితిమీరిన సెల్ఫోన్ వినియోగం కారణంగా బాలికల భద్రత అగమ్యగోచరంగా మారిందన్నారు. గ్రామస్థాయి సమావేశాల్లోనూ స్కూళ్లలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి వీరేంద్ర, ఏపీఎం ఈశ్వరి, టిడిపి నాయకులు వల్లేరు అమర్నాథ నాయుడు, వెలుగు సీసీలు, ఆశ, అంగన్వాడీ, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పారా ఒలంపిక్స్ జిల్లాస్థాయి పోటీలలో

సోమల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దఉప్పరపల్లి, సోమల ప్రాథమిక పాఠశాలలోని ఇద్దరు ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులు జిల్లాస్థాయిలో జరిగిన పారా ఒలంపిక్స్ పోటీలలో పాల్గొని మొదటి స్థానంలో నిలచి బంగారు పతకాలను సాధించారు. ఏడవ తరగతి చదువుతున్న అఖిల రన్నింగ్ రేస్ పోటీలలో పాల్గొని మొదటి బహుమతి గెలుపొంది బంగారు పతకాన్ని పొందారు. షాట్ పుట్‌లో మొదటి బహుమతి గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నారు. సోమల ప్రాథమిక పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్న ఎస్.మహమ్మద్ రన్నింగ్ రేస్ పోటీలలో ప్రథమ బహుమతి సాధించి బంగారు పతకం కైవసం చేసుకున్నారు. బుధవారం ఇద్దరు విద్యార్థులను ఎంఈఓలు విజయ కుమారి శివరత్నమ్మలు ప్రత్యేకంగా అభినందించి వారి తల్లిదండ్రులను పిలిపించి వారికి ధ్రువపత్రాన్ని గోల్డ్ మెడల్‌ను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు హేమ, సుధాకర్, శివరాజా ఐఇఆర్టీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎంఈవోలు

రేషన్ షాప్‌లో తహశీల్దార్ తనిఖీలు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ప్రభుత్వ నిబంధనలకు అనగుణంగా రేషన్ షాపును నిర్వహించాలని తహశీల్దార్ హనుమంతు అన్నారు. బుధవారం మండలంలోని కొన్ని రేషన్‌షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కోగిలేరు గ్రామంలోని 32వ షాపును తనిఖీ చేసి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేసిన మొత్తం, స్టాక్ రిజిస్టర్‌లను చౌక దుకాణంలోని నిల్వలను పరిశీలించారు. లబ్ధిదారులకు సకాలంలో నాణ్యమైన సరుకులు అందేలా చూడాలని, దుకాణాల నిర్వహణలో డీలర్లు సమయపాలన పాటించాలని, స్టాకు నిల్వలను సూచించే బోర్డులు డీలర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బియ్యం అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.ఈ తనిఖీల్లో గ్రామ రెవెన్యూ అధికారి శివ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడాలి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: అందరం బాధ్యతగా ఇంధనాన్ని పొదుపు చేసి భావితరాలకు వెలుగు నింపుదామని పుంగునూరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసమూర్తి అన్నారు. బుధవారం రాయలపేట జిల్లా పరిషత్ పాఠశాలలో ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంధన పొదుపుపై వ్యాసరచన పోటీ నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఆయన మాట్లాడుతూ ఒక యూనిట్ విద్యుత్తు ఆదాతో రెండు యూనిట్ల ఉత్పత్తికి సమానమని, అవసరం మేరకు వాడుకుని విద్యుత్ పొదుపు చేసుకుందామని అన్నారు. విద్యుత్ ఎంతో విలువైనదని వృధా కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పెద్దపంజాణి విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణ అన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

- ఆలోచింపజేసిన విద్యార్థుల సైన్సు నమూనాలు
- తిలకించిన అధికారులు ఉపాధ్యాయులు చిన్నారులు


ప్రజాశక్తి సోమల: మండల కేంద్రమైన సోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలలకు చెందిన ఆరు నుండి తొమ్మిదవ తరగతి చదివే విద్యార్థులు పలు రకాల సైన్స్ నమూనాలను తయారు చేసుకొని ప్రదర్శనలో ప్రదర్శించారు. ఎంఈఓ లు విజయకుమారి శివరత్నమ్మలు సైన్స్ ఫెయిర్‌ను రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సైన్స్ ద్వారానే సమాజం ప్రస్తుతం నడుస్తూ ఉందని నూతన ఆవిష్కరణలు అన్నీ కూడా సైన్స్ ద్వారా రూపొందుతున్నాయని విద్యార్థులు సైన్స్ పట్ల మక్కువ చూపి నూతన ఆలోచనలతో కొంగొత్త నమూనాలను తయారుచేసి దేశ అభివృద్ధికి నూతన సాంకేతికతను తీసుకురావాలని కోరారు.



సోమలలో..

బంగారుపాళ్యం: విద్యార్థి దశ నుంచి యువశాస్త్రవేత్తలను తయారు చేయడానికే సైన్సు ఎగ్జిబిషన్, సైన్సు మేళాలను నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి 2 రమేష్ బాబు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల సైన్స్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. తుంబపాల్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండల మొదటి స్థానాన్ని సాధించినట్లు తెలిపారు. ఉపాధ్యాయ బృందంలో బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయికి ఎంపికైందన్నారు. ఉపాధ్యాయులు ఘంటా మోహన్, సురేష్, సంపత్, హరిబాబు సీఆర్పీలు సుశీల, విశ్వనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాదమరి: స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం మండలస్థాయి సైన్సు ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి విద్యార్థులు, గైడ్ టీచర్స్ పాల్గొన్నారని ప్రధానోపాధ్యాయులు హేమలత తెలిపారు. ఎంఈవో హెచ్ఎల్ఎన్.ప్రసాద్ ముఖ్యఅతిథి విచ్చేసినారు. ఈకార్యక్రమంలో మొత్తంగా 40 ప్రదర్శనలు ఇవ్వడం జరిగింది. ఇందులో 9 మందిని విజేతలుగా గురించారు. ఈనెల 19న జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కి ఎంపికైనట్లు తెలిపారు. సైన్సు ఉపాధ్యాయులు ఎం.విజయకుమార్, కె.గొల్లపల్లె ఇన్‌ఛార్జి జె.భాస్కర్ రెడ్డి, కనకాచారి, షణ్ముగం, సుధ, హేమాద్రి పాల్గొన్నారు.



గంగవరంలో..

పలమనేరు రూరల్ (గంగవరం): గంగవరం ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించినట్లు మండల విద్యాధికారి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 18 పాఠశాలల్లో చదువుతున్న 8, 9 తరగతి విద్యార్థులకు సైన్స్ టీచర్ల సారథ్యంలో నిర్వహించిన సైన్సు ఎగ్జిబిషన్‌లో ఏడుగురు ఉత్తమ ప్రదర్శన అందించి విజేతలుగా గెలుపొందారు. వీరికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.



బంగారుపాళ్యంలో..

పలమనేరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సైన్స్‌ఫెయిర్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండలంలోని 10 హైస్కూల్ నుంచి దాదాపుగా 72 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో నుంచి ఏడు అంశాలలో సైన్స్ ఎగ్జిబిట్స్ ప్రదర్శించడం జరిగింది. ఇందు ఏడు గ్రూప్ ఎగ్జిబిట్స్, రెండు వ్యక్తిగత విద్యార్థి ఎగ్జిబిట్స్, రెండు ఉపాధ్యాయ ఎగ్జిబిట్స్‌లకు సర్టిఫికెట్, బహుమతులు ఇవ్వడం జరిగింది. మండల విద్యాశాఖ అధికారులు లీలారాణి, బాలసుందరం,ప్రధానోపాధ్యాయులు షంషీర్ షబ్బూ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రోడ్డు భద్రతా నియమాలపై చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు జిల్లా అంతటా హెల్మెట్‌ధారణ, ఇతర భద్రతా నియమాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం చిత్తూరు పట్టణంలోని పిసిఆర్ కూడలిలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ నారాయణ హెల్మెట్ ధారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు సీతమ్స్ కళాశాల విద్యార్థులకు హెల్మెట్ ధారణ, డ్రగ్స్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు మాట్లాడుతూ యువత భవిష్యత్తే దేశానికి బలమని అన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్‌తో పాటు వెనుక కూర్చునే పిలియన్ రైడర్ కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారితీయవచ్చని వివరించారు. అలాగే డ్రగ్స్ వాడకం వల్ల శారీరక ఆరోగ్యం, మానసిక స్థితి, కుటుంబ జీవితం తీవ్రంగా దెబ్బతింటాయని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువు, క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం, వేగ నియంత్రణ, మద్యం తాగి వాహనం నడపకపోవడం వంటి అంశాలపై ప్రజలు జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుత పౌరులుగా మారితే ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయన్నారు.



ప్రజలకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కేఈసీలో జేఎన్టీయూ క్రీడాకారుల ఎంపిక



ప్రజాశక్తి -కుప్పం: కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్టీయూ షటిల్ బ్యాట్మెటన్ పురుషులు, మహిళల జట్లకు సంబంధించిన క్రీడాకారులను ఎంపిక చేశారు. జేఎన్టీయూ పరిధిలోని 22 అనుబంధ కళాశాలలకు సంబంధించి 92 మంది విద్యార్థులు షటిల్ బ్యాట్మెంటన్ సెలక్షన్‌లో పాల్గొన్నారు. యూనివర్సిటీ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు సంబంధించి జేఎన్టీయూ తరఫున పురుషుల జట్టుకు ఏడు మంది ప్రధాని ఆటగాళ్లు మరో ఐదు మంది స్టాండింగ్ ప్లేయర్స్‌ను ఎంపిక చేశారు. అదేవిధంగా మహిళల జట్టుకు సంబంధించి ఐదు మంది ప్రధాని ఆటగాళ్లు నలుగురు స్టాండింగ్ ప్లేయర్స్ ఎంపిక చేశారు. జేఎన్టీయూ జట్టుకు కుప్పం ఇంజనీరింగ్ కళాశాల తరఫున ఇద్దరు అమ్మాయిలు ఒక అబ్బాయి ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ బిసి. నాగరాజ్, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్ రాజ్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్ బాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ సతీష్ కుమార్, ఆరనైజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ శరవణ, సత్యమూర్తి, వివేక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలను పరిశీలించిన డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి రాజేంద్రప్రసాద్ సందర్శించారు. ఈసందర్భంగా తరగతుల వారీగా విద్యార్థుల విద్యాప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో విద్యార్థుల అభ్యాస స్థితిగతులపై ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమగ్రంగా చర్చించారు. పదవ తరగతి విద్యార్థులు రాబోయే పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధనలో మరింత శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాల్యవివాహాలపై అవగాహనా కార్యక్రమంలో జిల్లా లీగల్ అధికారి వెంకటేష్‌తో కలిసి పాల్గొని విద్యార్థులకు బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. అనంతరం అరగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో నిర్వహించిన శాస్త్రవిజ్ఞాన ప్రదర్శనను ప్రారంభించి, ప్రదర్శనలో ఏర్పాటు చేసిన నమూనాలను పరిశీలించారు. విద్యార్థుల సృజనాత్మకతను అభినందిస్తూ ఇలాంటి కార్యక్రమాలు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పి.హేమలత, మండల అదనపు విద్యాశాఖ అధికారి ఏ.మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఆర్టీసీ వైస్ ఛైర్మన్

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మండలం కంగుందిలో రూ.17లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం ప్రారంభించారు. కంగుంది ప్రాంతం ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో గ్రామంలో దాదాపు అన్ని వీధుల్లో సిసి రోడ్ నిర్మాణ పనులను చేపట్టారు. కుప్పం ప్రాంతంను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ చూపుతున్నారని అందులో భాగంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ మౌలిక వసతులు కల్పన లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. జనవరిలో కంగుంది కొండపై బౌల్డరింగ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమం లో ఏపీ ఐఐసి డైరెక్టర్ ప్రేమ్ కుమార్, మండల అధ్యక్షుడు రాజగోపాల్, మాజీ ఎంపీపీ సాంబశివం, మాజీ మార్కెట్ చైర్మన్ సత్యంద్ర శేఖర్,కడ అడ్వైజర్ కమిటీ సభ్యుడు రామచంద్ర, కార్పొరేషన్స కార్పొరేషన్ డైరెక్టర్, సర్పంచ్ లు ధన శేఖర్,సంతోష్, కౌన్సిలర్ సోమశేఖర్, క్లస్టర్ ఇంచార్జ్ లు వేడి,హైదర్ అల్లి, దివాకర్ పాల్గొన్నారు.

డీఈవోను కలిసిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): పిఆర్టియు చిత్తూరు జిల్లాశాఖ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.గిరిప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం నూతన డీఈవో రాజేంద్ర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి సత్కరించి అభినందనలు తెలియజేశారు. డీఈవో మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు రాబోయే పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధనలో మరింత శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేంద్ర, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి, రేఖ, హిమ బిందు, విజయలక్ష్మీ, ఆశ, కె.భారతి పాల్గొన్నారు.



ఈ సైకిల్ డెమో ప్రదర్శన



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణతోపాటు ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో ఈ సైకిళ్ల వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా కీలక నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈ సైకిల్ డెమో ప్రదర్శనను ఎంపీడీవో పి.చంద్రశేఖర రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల ప్రజలు తమకు అవసరమైన ఈ సైకిళ్ల కోసం తమతమ గ్రామ సచివాలయాల్లో సంఘమిత్రల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పరిపాలనా అధికారి కె. ఆనంద బాబు, వెలుగు ఏపిఎం లలిత, బాలాజీ, సురేష్, శశికిరణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జగదీష్



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ కట్టా జగదీష్, పలమనేరు అర్బన్ సిఐ మోహన్ రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పలమనేరు సీనియర్ అండ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు సంబంధించి ఏజిపిగా నియమితులు కావడానికి సహకరించిన ఎమ్మెల్యేను సన్మానించిన జగదీష్ కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా విధుల్లో చేరిన పట్టణ సిఐ సైతం మొదటిసారి ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. టిడిపి నాయకులు సుబ్రహ్మణ్యం గౌడ్, ఖాజా, నాగరాజు, బిఆర్సీ కుమార్, మదన్, చాంద్ బాషా, నదీం పాల్గొన్నారు.

అన్ని సమస్యలు పరిష్కరిస్తాం..

చల్లా రామచంద్రారెడ్డి



ప్రజాశక్తి- రొంపిచర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లి ఫజులుపేట, ఆర్‌సి.పురం కాలనీ, సర్వర్‌పేటలో బుధవారం పుంగనూరు నియోజకవర్గ టిడిపి పార్టీ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి పర్యటించారు. ఈసందర్భంగా గ్రామస్తులు గ్రామంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. అర్హులైన వారికి ఇంటి స్థలాలు ఇవ్వాలని, సిసి రోడ్లు, వీధిలైట్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. వెంటనే రామచంద్రారెడ్డి స్పందించి వీలైనంత త్వరగా పనులను ప్రారంభించవలసిందిగా మండల కన్వీనర్ ఉయ్యాల రమణను ఆదేశించారు. కార్యక్రమంలో అబ్దుల్ కాకా నూర్, సి.సుధాకర్, ఎస్. మొహమ్మద్ అలీ, ఎస్.రఫీ, ఎస్.బావాజీ పాల్గొన్నారు.

జీవో నెంబర్ 590ను రద్దు చేయాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సంజయ్

ప్రజాశక్తి- పలమనేరు

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు మెడికల్ విద్యను దూరం చేస్తూ తీసుకొచ్చినటువంటి జీవో నెంబర్ 107, 108లను రద్దు చేయాలని, పిపిపి విధానాన్ని ఉపసంహరించుకోవాలని బుధవారం నిరసన తెలిపారు. ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు సంజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు గత ప్రభుత్వం తీసుకురాగా వాటిని ఎన్డీఏ ప్రభుత్వం పిపిపి విధానంతో ప్రైవేటీకరణ చేస్తున్నారని దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉండటం ద్వారా పేద విద్యార్థులకు పేద ప్రజలకు ఉచితంగా విద్యవైద్యం అందుతుందని దీనికి వ్యతిరేకంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి పీపీపీ విధానం చాలా దుర్మార్గం దీనివల్ల ఎంతో మంది విద్యార్థులు ప్రజలు నష్టపోతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలు, విద్యార్థుల శ్రేయస్సు కోరుతున్నట్లు అయితే వెంటనే పిపిపి విధానాన్ని రద్దుచేసి మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులను ప్రజాసంఘాలను ఐక్యం చేసుకొని పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నాయకులు అమాన్, వసంత్, జగన్, అభి పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన గంగమ్మ జాతర

భక్తులను ఆకట్టుకున్న కళాబృందాలు

ప్రజాశక్తి- కార్వేటినగరం

ప్రతి ఏడాది గంగమ్మ జాతరను డిసెంబరులోని కార్తీక మాసంలో ఆనవాయితీ ప్రకారం నిర్వహిస్తారు, ఈ జాతర సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. బుధవారం వేకువ జామున 1 గంటలకు బంగారమ్మ ఆలయం వద్ద నుండి నగరంలోని నాలుగు రాళ్లవరకు మేళతాళాలు ప్రత్యేక వాయిద్యాల నడుమ ఊరేగించారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారికి ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులను తీర్చుకున్నారు. మహిళలు అమ్మవారివెంట వేలాది సంఖ్యలో వెయ్యి కళ్లల దుత్తలను మోసి మొక్కులను తీర్చుకున్నారు. అలాగే యువత ఆధ్వర్యంలో బండ వేషం, రాక్షసవేషం తమిళనాడుకు చెందిన గరగాటం, విజయవాడకు చెందిన వీరయ్య కళాబృందం మహాశక్తి, బట్టర్ ఫ్లై వేషకాలతో పలువురిని ఆకట్టుకున్నారు. సాయంత్రం అమ్మవారిని మేళతాళాలతో బాణా సంచులు పేలుస్తూ నగరం సమీపంలోని కోట చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కె.ప్రసాద్, ఉపాధ్యక్షుడు రంగనాదమొదలి, కార్యదర్శి చంద్రశేఖరిశెట్టి గ్రామస్తులు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో ఎస్ఐలు తేజశ్వనీ, రాజశేఖర్రెడ్డి, 75 మంది పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

21న పల్స్ పోలియో

ప్రజాశక్తి- శాంతిపురం: ఈనెల 21వ తేదీ ఆదివారం దేశవ్యాప్తంగా 0 నుండి 05 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ పల్స్ పోలియో వేయనున్నారని ఇందులో భాగంగా మండలంలోని మొత్తం 6697 మంది పిల్లలంరందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయాలని ఎంపిడిఓ ఎపిఆర్.కుమార్ తెలిపారు. ఇందుకు గాను మొత్తంగా 52 పల్స్ పోలియో బూత్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, తల్లిదండ్రులు పిల్లకు పోలియా చుక్కలను వేయించాలని కోరారు. సమావేశంలో తహశీల్దార్ ప్రకాష్ బాబు, వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణా, మండల విద్యాశాఖాధికారి చంద్రమ్మ, సెల్వకుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ పాల్గొనారు.

ఘనంగా షర్మిల జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి- పుంగనూరు: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలను పుంగనూరులో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అయాబ్ బాషా ఆధ్వర్యంలో స్థానిక ప్రైవేటు బస్టాండ్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ముబారక్ పాషా, ఫయాజ్, అజ్మత్, ఇబ్రహీం, సుహేల్, సాదిక్ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలను పుంగనూరులో ఘనంగా నిర్వహించారు.పీసీసీ కార్యదర్శి బిజే.అనిల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామప్ప, నాయకులు ఖాదర్ బాషా, ఆర్ఎం. నాయుడు పాల్గొన్నారు.

21న తెలుగుభాష సదస్సు

ప్రజాశక్తి- పలమనేరు రూరల్ (గంగవరం): ఈనెల 21వ తేదీ ఆదివారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో గంగవరం సాయి గార్డెన్ సిటీలోని కళామందిరంలో తెలుగు భాష సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష కార్యదర్శులు పి.తులసినాథం నాయుడు, పుష్ప బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో తెలుగు బాష రక్షణకు తీసుకోవలసిన చర్యలపై చర్చించడంతోపాటు నూతనంగా ఏర్పాటైన మండలి వెంకటకృష్ణారావు తెలుగు అధికార భాష సంఘానికి నివేదిక అందించనున్నట్లు తెలిపారు.

పెరుమాళ్లపల్లిలో ఎన్ఎస్ఎస్ క్యాంపు




ప్రజాశక్తి- వెదురుకుప్పం: స్థానిక డాక్టర్ వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ తరపున స్పెషల్ క్యాంపును మండలంలోని పెరుమాళ్ళపల్లి గ్రామంలో బుధవారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సి.మంగళ గౌరీ, గ్రామ సర్పంచ్ బి.శశి ఆనంద రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మొదటి రోజు 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, నలుగురు కమిటీ మెంబర్స్ క్లీనర్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని విడతల వారిగా చేసి గ్రామాన్ని శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ కమిటీ మెంబర్లు డాక్టర్ డి.లావణ్య కుమారి, డాక్టర్ వి.నాగేశ్వరరావు, వై.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్స్ డే వేడుకలు



ప్రజాశక్తి- విజయపురం (నగరి): పట్టణ పరిధిలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో బుధవారం పెన్షనర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల్లోని విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో భవనం వద్దకు చేరుకున్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జయచంద్రుడు, గౌరవ అధ్యక్షులు ఓ.బాలసుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి లక్ష్మీపతి పెన్షనర్స్‌డే ప్రాముఖ్యతను తెలుపుతూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి అతిథిగా జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్ర మాట్లాడుతూ లైఫ్‌సర్టిఫికేట్లు తీసివ్వడంలోను, పెన్షన్ సంబంధిత సమస్యలు పరిష్కరించుకోవడంలోను పెన్షనర్ల సంఘం తమకంటూ ప్రత్యేకతను చాటుకుంటోందన్నారు. పదవీ విరమణచేసి 15 సంవత్సరాలు నిండిన పెన్షనర్లు భక్తవత్సలం, జయ చంద్రుడు, పద్మావతమ్మ, విశ్వనాథ ఆచారి, మోహన్‌రావు, షణ్ముగం, రాజామణి, మునిరత్నం, శశికళ, మురళిప్రసాద్, పెరుమాళ్, ఆరుముగం, జాయిస్ క్రిష్టియానా, సాయిప్రసాద్, సుబ్రమణ్యంలను విశ్రాంత ఉద్యోగులు పూల దండలతోను, దుస్సాలువలతోను సన్మానించి వారు చేసిన సేవలను కొనియాడారు. పెన్షనర్ భవన స్థలదాత సరస్వతి రాజగోపాల్‌రాజు, జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి గురురాజారావు, ఎంఈవో శ్రీదేవి, అధ్యక్షులు ఎం.ఎ.జయరామ్ పాల్గొన్నారు.

వేలంపాటలో రూ.4లక్షలు ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని మొగిలి గ్రామంలో వెలసిన శ్రీస్వయంభు మొగిలీశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం తలనీలాల వేలంపాట ఆలయ కార్యనిర్వాహణ అధికారి మునిరాజులు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తలనీలాలు పోగు చేసుకొను హక్కుకు గాను ఒక సంవత్సరంకు రూ.4,03,000లు ఆదాయం వచ్చిందని తెలిపారు. తలనీలాలు కాలపరిమితి తేదీ 1.1.26 నుండి 31.12.26 వరకు మాత్రమేనని తెలిపారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం రూ.63,000లు అధిక ఆదాయం వచ్చిందన్నారు. అధికారి శ్వేత, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబి.విజయకుమార్, ప్రసాద్ నాయుడు, ధనుంజయ నాయుడు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

వ్యవసాయ అధికారి కుసుమ



ఎస్ఆర్ పురంలో..

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై మండల వ్యవసాయ అధికారి కుసుమ, ఏపీఎం రోజా ఆధ్వర్యంలో రైతులకు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం వలన తక్కువ ఖర్చులతో ఎక్కువ ఆదాయం వస్తుందని, పురుగు మందు లేని వ్యవసాయం చేసుకుంటే మనిషికి, భూమికి, ఆరోగ్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఏక పంటలు వద్దు బహుళ పంటలు వేయడం లాభదాయకమని అన్నారు. కాషాయం, ద్రావణంతో వ్యవసాయం చేసుకోవాలని, ప్రతి మహిళా సంఘ సభ్యులు వాళ్ళ ఇంటి దగ్గర కిచెన్ గార్డెన్స్ వేసుకొని రసాయనాలు లేని కూరగాయలు పండించి తినాలని, ప్రకృతి వ్యవసాయన్ని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. మార్కెటింగ్ వ్యవస్థ, పిజిఎస్ సర్టిఫికెట్ గురించి ఎఫ్ఎం టి.ప్రతాప్, సరిత క్లుప్తంగా వివరించారు.

విజయపురం (నగరి): ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసే పంటల్లో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చని వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య, రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్, కెఎపి రైతులు ప్రకృతి వ్యవసాయంపై సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. మార్కెటింగ్ వ్యవస్థ, పీజీఎస్ సర్టిఫికెట్ గురించి ప్రకృతి వ్యవసాయ ట్రైనర్ చంద్రశేఖర్ క్లుప్తంగా వివరించారు. ప్రకృతి వ్యవసాయ వనరులను మార్కెటింగ్ చేసుకోవడం సులభతరమన్నారు. వీవోఏ, విఓఓబిలు, రైతులు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలం ఎంపీడీవో కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని, ప్రకృతి వ్యవసాయం విధివిధానాలను మహిళా సంఘాల సభ్యుల ద్వారా గ్రామాల్లోకి తీసుకెళ్లాలని టిడిపి మండల అధ్యక్షులు మోహన మురళి తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో పురుషోత్తం ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, సహజసిద్ధంగా పండించే పంటల వలన కలిగే లాభాలను మహిళా సంఘాల సభ్యులు గ్రామస్తులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వనిత, ఏపిఎం పరుశురామిరెడ్డి, ఏపీసీఎన్ఎఫ్ మండల ఇన్చార్జి ఎన్.మురళి, మాజీ సర్పంచ్ బాబురెడ్డి, తులసిరామ్ యాదవ్, విక్రమ్ రెడ్డి పాల్గొన్నారు.



విజయపురంలో..

33 కెవి సబ్‌స్టేషన్‌కు భూమి కేటాయింపు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని బాలగంగానపల్లిలో ఏర్పాటు చేయనున్న 33/11 కెవి సబ్ స్టేషన్‌కు భూమి కేటాయించారని విద్యుత్ శాఖ డీఈ శేషాద్రి రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు వరత్తూరు గ్రామ లెక్క దాఖలా లోని సర్వే నంబరు 1025/8 లో 1.10 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం రెవెన్యూ అధికారులు భూమిని సర్వే చేసి హద్దులు చూపించి, విద్యుత్ అధికారులకు అప్పగించారు.ఈ కార్యక్రమంలో ఏఈ తనిగవేలు, వరదరాజులు, మండల సర్వేయర్ గణేష్, వీఆర్వో ప్రవీణ్ పాల్గొన్నారు.



విద్యుత్ సబ్ స్టేషన్‌కు కేటాయించిన స్థలంలో అధికారులు

శుద్ధినీటి యంత్రం వితరణ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ బాలుర వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులకు శుద్ధి తాగునీటి సౌకర్యం కల్పించే దిశగా గడ్డూరు గ్రామానికి చెందిన నేషనల్ హ్యూమన్ రైట్స్ మహిళా ఉపాధ్యక్షురాలు ఎం.విజయ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. కొద్ది రోజుల క్రితం వసతి గృహాన్ని సందర్శించిన విజయకు విద్యార్థులు తాగునీటి సమస్యను వారి దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి ఆమె రూ.30వేలు విలువ చేసే మినరల్ వాటర్ ప్యూరిఫై ప్లాంట్‌ను వితరణగా అందిస్తానని ప్రకటించారు. ఈ మేరకు బుధవారం వాటర్ ప్లాంట్‌ను అమర్చించి ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆఫీసర్ మీనాక్షి, ఎంఈఓ 2 సుబ్రమణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మనోరంజని పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు దాత విజయ చేస్తున్న సేవాకార్యక్రమాలను అభినందించారు.



మినరల్ వాటర్ ప్యూరిఫైయర్‌ను అందిస్తున్న దాత విజయ


టిడిపిలో చేరిన వైసిపి కార్యకర్తలు



ప్రజాశక్తి- శాంతిపురం: మండలంలో 23 గ్రామ పంచాయతీలకు చెందిన వైసిపి కార్యకర్తలు భారీ సంఖ్యలో మండల పార్టీ అధ్యక్షుడు ఉదయ్ కుమార్ నేతృత్వంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం స్థానిక నందిగం కళ్యాణమండపంలో తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శాంతిపురం మండలానికి చెందిన 225 కుటుంబాలును ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, పికేఎం పుడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు ప్రతి ఒక్కరికి తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో తమ వంతు కృషిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ అంటే క్రమశిక్షణకు మారుపేరని అలాంటి పార్టీలో చేరిన ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో పార్టీ సూచనలను అనుసరించి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం అభివృద్ధిని వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గోపాల్, గుంజార్లపల్లి సర్పంచ్ విజయరామిరెడ్డి, విశ్వనాథ్ నాయుడు, బాలాజీ, కార్యదర్శి మంజునాథ్ పాల్గొన్నారు.

కొండచుట్టు మండపాన్ని కూల్చకండి

ఆర్డీవో కార్యాలయానికి, జాతీయ రహదారి పీడీకి వినతి



ప్రజాశక్తి- విజయపురం (నగరి): కొండచుట్టు మండపాన్ని కాపాడాలంటూ ప్రజాప్రతినిధులు బుధవారం ఆర్డీవో కార్యాలయంలో డీఏవో శివకుమార్‌కు వినతిపత్రం అందించారు. ప్రాచీన కట్టడాలు స్మారక చిహ్నాలని మండపాన్ని వదలిపెట్టి ఎదురుగా అవసరమైన స్థలం ఉన్నందున అక్కడ రోడ్డును అధికారులు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆరు శతాబ్దాలుగా చరిత్రను గుర్తుచేసే కట్టడాన్ని కూల్చివేయడం మంచిది కాదని, నగరి ప్రజల సెంటిమెంటును కాపాడుకోవాలన్నారు. ఈ మండపం తొలగింపుకు వచ్చే నెల 20వ తేదీ వరకు గడువు ఇచ్చినట్లు ప్రకటించారని ఇది రానున్న ఏడాదికి మాత్రమే ఉత్సవాలు జరుపుకునేందుకు గడువు ఇచ్చినట్లు తెలుస్తోందన్నారు. అనంతరం జాతీయ రహదారి ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రరావుకు ప్రజల అభీష్టం మేరకు మండపాన్ని కూల్చరాదంటూ ప్రజాప్రతిదులు రిజిష్టర్ పోస్టుజి ద్వారా వినతులను సమర్పించారు. మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ వెంకటరత్నం, ఎంపిపి భార్గవి, వైస్ఎంపీపీ కన్నియప్ప, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -సోమల

సోమల మండలం నంజంపేట గ్రామానికి చెందిన సుమన్ బాబు మండల విద్యా వనరుల కేంద్రంలో సిఆర్ఎంటి గా బాధ్యతలు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతిచెందారు. మండలంలోని ఎస్టీయూ, యూటీఎఫ్ సంఘ నాయకులు ఉపాధ్యాయులు మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు విరాళాలను సేకరించి బుధవారం మృతుడి తల్లికి రూ.51 వేలను అందజేశారు. ఎంఈఓలు విజయ కుమారి, శివ రత్నమ్మ, ఉపాధ్యాయులు జి.సి.కె ప్రసాద్, ఎస్.వెంకటరమణ, భాస్కర్, ఇమ్రాన్, సుబ్రహ్మణ్యం, రమణయ్య పాల్గొన్నారు.



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయులు

క్రైం న్యూస్

ప్రైవేట్ ఫైనాన్సు వేధింపులు

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చలపతి

ప్రజాశక్తి- పుంగనూరు: ప్రైవేట్ ఫైనాన్సులో రుణం తీసుకుని సక్రమంగా చెల్లించలేదంటూ వేధింపులతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన బుధవారం పుంగనూరు చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు మండలంలోని నల్లగుట్లపల్లి గ్రామానికి చెందిన వీరప్ప కుమారుడు చలపతి (50) గృహ నిర్మాణం కోసం ప్రైవేట్ ఫైనాన్సు వారి నుంచి రుణం తీసుకున్నారు. తీసుకున్న రుణం వాయిదాల ప్రకారం చెల్లించలేకపోవడంతో వారు నిత్యం ఫోన్లు చేసి వేధించేవారని, సమయం అడిగా అవమానకరంగా మాట్లాడేవారిని తెలిపారు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గుర్తించడంతో వెంటనే మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు, పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో

ఇద్దరు నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తవణంపల్లి మండలం కే.పట్నం ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి తిరుపతి వైపు వెళ్లే సర్వీస్ రోడ్డులో ఈ ఘటనకు సంబంధించి కీలకచర్యలు చేపట్టారు. తవణంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసు ప్రకారం చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితులను సబ్ ఇన్స్పెక్టర్ ఎ.చిరంజీవి ఆధ్వర్యంలో అరెస్ట్ చేశారు. అరెస్టు అయిన వారిలో నెల్లూరు జిల్లా బోగోలు మండలం కప్పరాల తిప్ప గ్రామానికి చెందిన తుపాకుల హనోక్ కుమార్, ప్రస్తుతం తిరుపతి జిల్లా చంద్రగిరి పట్టణం, మండలంలో నివాసం ఉంటున్న చిత్తూరు జిల్లా నగరి మండలం కవేరిపురం గ్రామానికి చెందిన శామ్యూల్రాజ్ ఉన్నారు. నిందితుల వద్ద నుంచి 32 గ్రాముల బంగారు చైన్‌ను, మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయస్థానం ముందు హాజరు పరచగా వారిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ - ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- పుంగనూరు: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలైన ఘటన బుధవారం మండలలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొండముదొడ్డి గ్రామానికి చెందిన హరి (45), జనార్ధన్ రాజు (52) కుమ్మరిగుంట గ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఓడెలివరీ బాయ్ పుంగనూరుకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో హరి, జనార్ధన్‌రాజు తీవ్రంగా గాయపడటంతో స్థానికులు వారికి పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హరికి తలకు బలమైన గాయం తగలడంతో ప్రాథమిక చికిత్సలు నిర్వహించి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించినట్లు తెలిసింది. డెలివరీ బాయ్ ప్రమాదం జరిగిన వెంటనే అతని వాహనంలో పరారయ్యాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి.. సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- రామకుప్పం

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయుడు సుపరిపాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బాలఓబనపల్లి గ్రామంలో రూ.14 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్డుకు భూమిపూజ చేశారు. గ్రామాల అభివృద్ధికి కడ ద్వారా అవసరమైన నిధులను కేటాయించి పనులను శరవేగంగా జరుగుతోందన్నారు. కేంచన బల్ల గ్రామంలో పలువురు వైసిపీ కార్యకర్తలు టిడిపిలో చేరగా వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు. రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షుడు వెంకటరమణ, కార్యదర్శి కామరాజు నాయక్, ఎంపీపీ, సులోచన గుర్రప్ప, వైస్ ఎంపీపీ వెంకట్రామ గౌడు, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, మాజీ సర్పంచులు శ్రీనివాసులురెడ్డి, రామ్మూర్తి, జయశంకర్, కడ సభ్యుడు రఘు, క్లస్టర్ ఇంచార్జిలు రవి రెడ్డి పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి -కుప్పం: మదనపల్లి నుండి శబరిమలైకు కాలినడకన పయనమైన అయ్యప్ప భక్తులకు కుప్పం మండలం మంకలదొడ్డి పంచాయతీ అడవి ములకలపల్లికి చెందిన అయ్యప్ప భక్తులు అన్న ప్రసాదం అందజేశారు. గడిచిన 17ఏళ్లుగా అయ్యప్ప భక్తులు మదనపల్లి నుండి శబరిమలైకి పాదయాత్రగా వెళ్లి స్వామివారి దర్శనం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో 90మంది అయ్యప్ప భక్తులకు కుప్పం పోలీస్ స్టేషన్ల హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చక్రపాణి వెండుగం పల్లి ధర్మరాజుల గుడి వద్ద అన్నప్రసాదం అందించారు. అదేవిధంగా కాలి కోయిల్ వద్ద రెస్కో డైరెక్టర్ మురళి ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులు కాలినడకన శబరిమలై వెళ్తున్న అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు.

పత్తి కుమారమ్మకు నివాళి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: అనారోగ్యంతో మృతి చెందిన పత్తి కుమారమ్మ ఉత్తరక్రియలు సందర్భంగా ఆమెకు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజన్న నివాళులర్పించారు. ఈనెల 3వ తేదీ అనారోగ్యంతో కుమారమ్మ మృతిచెందారు. బుధవారం ఆరిమాకులపల్లె గ్రామంలో ఆమె కుమారులు పత్తి జగదీశ్వర్ నాయుడు, పత్తి హిమగిరి నాయుడు ఉత్తర క్రియలు జరిపారు. ఉత్తర క్రియలలోపాల్గొన్న రాజన్న కుమారమ్మ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. జగదీశ్వర్ నాయుడు, హిమగిరి నాయుడు లను పరామర్శించారు. పెనుమూరు మార్కెటింగ్ చైర్మన్ కృష్ణమ నాయుడు, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, జిల్లా నాయకులు సూరి నాయుడు, జయచంద్ర నాయుడు, గంగాధర నెల్లూరు మండల మాజీ జడ్పిటిసి గుణశేఖర్ మొదలియార్ కొత్తపల్లి మిట్ట సూరి రెడ్డి పాల్గొన్నారు.

18న ఉచిత ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి- పలమనేరు

పలమనేరు పురపాలక సంఘ మెప్మా అధ్వర్యంలో పట్టణ స్వయం సహాయ సంఘాల్లోని మహిళకు ఈ నెల18వ తేదీన గురువారం ఉదయం 8.30 గంటలకు పలమనేరు పట్టణములోని ఏవీసీ కళ్యాణ మండపంలో ఉచితంగా సఖి సురక్ష ఆరోగ్య పరీక్షల కార్యక్రమం నిర్వహించబడనని మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, కొలస్ట్రాల్, గుండె సంబంధిత, రక్త హీనత, విటమిన్ లోపం, పోషకాహార లోపాలతో పాటు 3 రకాల కేన్సర్ పరీక్షలు, 4 రకాలు మానసిక ఆరోగ్య సమస్యలు, 16 రకాల నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయబడునని తెలియజేశారు. కనుక పట్టణ పరిధిలోని మహిళలు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.